వర్షాలకు బహుపరాక్!

- వాణిజ్య పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- వర్షం తగ్గిన వెంటనే నీరు బయటకు పంపించాలి
- సరైన ఎరువులు, మందులు వాడాలి
- తెనాలి ఉద్యాన అధికారి శ్రీనిత్య సూచనలు



కొల్లిపర మండలంలో పసుపు పంటలో నిలిచిన నీరు

కొల్లిపర: గత సంవత్సరం కంటే ఈ సంవత్సరంలో వాతావరణంలో మార్పులు వలన అధిక వర్షాలు నమోదు అవుతున్నాయి. కొల్లిపర మండలంలో అరటి, పసుపు, కంద, కూరగాయలు వంటి వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులు ఆయా పంటల్లో నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నపుడే చీడపీడల నుంచి పంటలు రక్షించటమే కాకుండా అధిక దిగుబడులు సాదించవచ్చని తెనాలి హార్టికల్చర్ అధికారిణి తోటకూర శ్రీనిత్య అన్నారు. అధిక వర్షాలు కారణంగా పంటలు ఏవిధంగా రక్షించుకోవాలనే అంశాలపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని వివరించారు.

అరటి

తోటలో నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా దారులు చేసి బయటకు తీయాలి. నీరు బయటకు తీసిన 24 గంటలు తరువాత ప్రతి అరటి చెట్టు కి 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల పొటాష్ ఎరువులను వేసుకోవాలి. అరటి దుంప కుళ్లి పోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా లీటరు నీటికి కలపి దుంప తడిచేటట్లుగా నీటిని పోయాలి.

పసుపు

పసుపు పంటలో నిల్వ ఉన్న నీటిని పాదులు ద్వారా బయటకు పంపేలా చర్యలు తీసుకొని, వర్షం తగ్గగానే 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. ఆకుమచ్చ తెగులు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా ప్రొపికొనజోల్ ద్రావణాన్ని 1గ్రామును లీటరు ద్రావణంతో పిచికారీ చేయాలి.

కంద, చేమ

కాండం మరియు దుంపకుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములను లీటరు ద్రావణంతో మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలి.

కూరగాయ తోటల్లో ...

వర్షం తగ్గిన వెంటనే పొలాల్లోని నీటిని బయటకి పంపి సూక్ష్మపోషకాలు 19:19:19 లేదా 13:0:45లను పై పాటుగా పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను గ్రాము ప్లాంటామైసిన్‌తో కలిపి పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

తెనాలిటౌన్: ప్రత్తిపాడు 220 కేవీ సబ్‌స్టేషన్‌లో 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మెయింటెన్స్ పనులు జరుగుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సమగ్ర చర్యలు తీసుకున్నట్లు ఏపీసీపీడీసీఎల్ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మరమ్మతులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడితే వినియోగదారులు స్థానిక విద్యుత్ కార్యాలయంలో తెలియపరచాలని కోరారు.

మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ శివన్నారాయణ మృతి



తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకులు మాదల శివన్నారాయణ (70) ఆదివారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్‌గా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో తెనాలి ప్రాంత రైతులకు సేవలందించారు. వైఎస్సార్ సీపీలో సీనియర్ నాయకుడిగా సేవలందిస్తున్నారు. వృత్తి రీత్యా తాపీ మేస్త్రిగా పేరుగడించారు. ఆయన భౌతికకాయాన్ని పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్, కఠెవరం మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, ఎంపీటీసీ మైలా భానుప్రసాద్, తాడిబోయిన శంకరరావు, చావలి ఆశోక్‌యాదవ్, సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ మేకల శివరామయ్య, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలినేనికి సత్కారం



తెనాలి: పట్టణ సీనియర్ న్యాయవాది వెలినేని రాఘవయ్యను తెనాలిలోని పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం వెలినేని రాఘవయ్య, పద్మజారాణి దంపతులను ఘనంగా సత్కరించారు. సొసైటీ సమావేశ మందిరంలో ఏర్పాటైన సమావేశానికి కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ పీఎస్సార్ బ్రహ్మాచార్యులు అధ్యక్షత వహించారు. గౌరవ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు, బ్యాంక్ చైర్మన్ దావులూరి చక్రధర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య, కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్ సీఈఓ ఝాన్సీలక్ష్మి, బ్యాంక్ డైరెక్టర్లు షేక్ ఖలీల్, కటారి వాసుదేవ నాయుడు, సుబ్రహ్మణ్యశాస్త్రి, బీజేపీ నేత నందకిషోర్ పాల్గొన్నారు.

వృద్ధాప్య వ్యాధులపై అవగాహన



తెనాలి: వాకర్స్ క్లబ్ తెనాలి–2 సమావేశం ఆదివారం సాయంత్రం చెంచుపేటలోని కోగంటి శివయ్య హైస్కూలు రోడ్డులో జరిగింది. క్లబ్ అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్యనిపుణులు డాక్టర్ చందోలు భానుప్రసాద్ తన ప్రసంగంలో ఎలర్జీలు, థైరాయిడ్, మెడ నరాల నొప్పులకు కారణాలు, నివారణపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఆనందరావు, భుజంగరావు, మురహరిరావు, సత్యనారాయణ రాజు, సరశ్రీ పూర్ణ, రావి సుబ్బారావు, అనూరాధ, రమాదేవి, దేవాభక్తుని ఉమామహేశ్వరరావు, తుమ్మల సత్యనారాయణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి



తాడేపల్లి రూరల్: పాలకులు ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలోని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులపై పాలక పార్టీలు ఏ దృక్పథంతో ఉంటాయో సిమెంట్ ఫ్యాక్టరీ సమస్య చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. నేతలు తుపాకుల నాగేశ్వరరావు, సాంబశివరావు, సుబ్బారావు, బాషా, కార్మికులు నవనీతమ్మ, సూర్యప్రకాష్, దుర్గా భవాని, ఇమాంబి, శారద, సారమ్మ పాల్గొన్నారు.

పాస్టర్లకు బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేసిన బ్రదర్ ఆనందన్న

తెనాలి: ది తెనాలి టౌన్ పాస్టర్స్ గ్రేట్ సపోర్ట్ అండ్ ఫుల్ హెల్పింగ్ అసోసియేషన్ సమావేశం ఆదివారం సాయంత్రం ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బ్రదర్ ఆనందన్న అధ్యక్షత వహించారు. ఎంపిక చేసిన తెనాలి పట్టణ పాస్టర్ల కుటుంబాలకు రూ.1500 విలువైన 26 కిలోల రైస్ బ్యాగ్స్ ఉచితంగా అందజేశారు. ప్రభుత్వం దైవజనులకు ఇస్తున్న రూ.5 వేల గౌరవవేతనం రూ.10 వేలకు పెంపుదల చేసి, ప్రతినెల క్రమం తప్పకుండా ఇవ్వాలని కోరుతూ తీర్మానించారు. పట్టణంలో బాప్తిజం ఘాట్ ఏర్పాటు, పాస్టర్ల సమావేశాలకు ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని, జెరుసలేం వెళ్లేందుకు ఛార్జీల్లో రాయితీని కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. అసోసియేషన్ సభ్యులు ఎం.అశోక్, ఫ్రాన్సిస్, దైవసేవకురాలు పి.రత్నకుమారి, ఛార్లెస్ వెస్లీ, ప్రశాంత్‌బాబు, వల్లి నిర్మల, అలేఖ్య, కుమారి తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలను తిప్పికొట్టండి

తెనాలిఅర్బన్: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, జనసేన పార్టీపై సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాలను పార్టీ నాయకులు, వీర మహిళలు తిప్పి కొట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలిలోని జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ పవన్‌కల్యాణ్‌పై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాపై నియంత్రణ పెట్టాల్సి ఉందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ లైట్ ట్రాప్‌లు పంపిణీ



సోలార్ లైట్ ట్రాప్‌లతో రైతులు

కొల్లిపర(తెనాలి): పంటపొలాలకు కీటకాల బారి నుంచి రక్షణకు సోలార్ లైట్ ట్రాప్ ప్రయోజనకరమని కొల్లిపర మిత్రమండలి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల కేంద్రమైన కొల్లిపరలోని విశ్వశాంతి హైస్కూలు వద్ద ఆదివారం మిత్రమండలి సభ్యులు తొమ్మిదిమందికి సోలార్ లైట్ ట్రాప్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వాటి వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ వుయ్యూరి సాంబిరెడ్డి మాట్లాడుతూ పంటపొలాల్లో ఉంచే సోలార్‌లైట్ ట్రాప్‌లు పగటిపూట సూర్యరశ్మిని గ్రహించి సాయంత్రం ఆరు గంటల్నుంచి తొమ్మిది గంటల వరకు వెలుగుతాయని చెప్పారు. ఆ సమయంలో చెడు పురుగులు, కీటకాలు ఆకర్షితులయి లైటు చుట్టూ ఏర్పాటుచేసిన నీటిలో పడి మరణిస్తాయని చెప్పారు. రైతులకు వీటితో ఉపయోగం ఉన్నట్టుగా భావిస్తే మరిన్ని అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు, రైతులు, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థినులు ఉన్నారు.

మొబైల్స్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సమావేశం



తెనాలి: పట్టణంలోని తెనాలి మొబైల్స్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం బోసురోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ కళాసదనంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హిదయతుల్లా (జానీ) అధ్యక్షత వహించారు. అసోసియేషన్ విధివిధానాలను ప్రతి రిటైలర్‌కు తెలియజేశారు. సభ్యులంతా ఏకతాటిపై నడిచి అసోసియేషన్‌ను బలోపేతం చేసుకోవాలని వక్తలు సూచించారు. సభ్యులకు నూతనంగా ఐడీ కార్డులను అందజేశారు. స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించాలనే భావనతో 'మన ఊరు–మన దుకాణం' నినాదాన్ని తీసుకొచ్చారు. ఉపాధ్యక్షుడు చెర్రీ, కార్యదర్శి డి.సంపత్‌కుమార్, సంయుక్త కార్యదర్శి కిషోర్, కోశాధికారి రాజు, కమిటీ సభ్యులు ఓం సాయిమణి, మణిదీప్, షఫీ, ఆలీ, కోటేశ్వరావు, మొబీన్, కిషోర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాసకుటిలో భక్తుల సందర్శనార్థం శ్రీరాముని కోదండం

తెనాలి: అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి వంశీకులచే కళ్యాణ రామమందిర నిర్మాణం సందర్భంగా వారి కోదండం సోమవారం ఉదయం రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని దాసకుటిలో భక్తుల సందర్శనార్థం ఉంటుందని ఆశ్రమ పీఠాధిపతి శ్రీసీతారామదాసస్వామి వెల్లడించారు. అంగలకుదురులోని ఆంధ్రవాల్మీకి శ్రీవాసుదాసు స్వామి వారి పరంపర పీఠం 'దాసకుటి'లో 74వ శ్రీమహాలక్ష్మి అమ్మవారి కుంకుమార్చన షష్ఠమ పీఠాధిపతి శ్రీసీతారామదాసస్వామి ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం రమాసహిత శ్రీసత్యనారాయణస్వామి వ్రతం జరిపారు. కుంకుమపూజ, హోమం నిర్వహించారు. 15వ తేదీన మహాలక్ష్మి అమ్మవారికి 16 కలశాలతో అభిషేకం, పూర్ణాహుతి ఎంతో విశేషంగా జరుగుతాయని శ్రీసీతారామదాసస్వామి తెలియజేశారు. ఇదే సందర్భంగా అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి వంశీకులచే కళ్యాణరామ మందిరం, 108 అడుగుల శ్రీరాముని విగ్రహ నిర్మాణం జరుగుతున్నాయి. వారి కోదండం ఉదయం 9.30 గంటల్నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దాసకుటిలో ఉంటుందని, భక్తులు దర్శించుకోవాలని ఆయన కోరారు.

కేఎల్‌యూలో ముగిసిన స్కిల్ పలావర్



స్కిల్ పలావర్ ప్రాజెక్టును విద్యార్థులకు వివరిస్తున్న కేఎల్‌యూ ఆచార్యులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యాన ఆదివారం విద్యార్థులకు స్కిల్ పలావర్ నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ స్కిల్ పలావర్ మూడు దశల్లో వేర్వేరు సమయాల్లో ఆయా విభాగాల విద్యార్థుల సమూహాలను లక్ష్యంగా చేసుకుని నిర్వహించామని తెలిపారు. ప్రతి దశలో మూడు ముఖ్యమైన భాగాలు ఉన్నాయని, వాటిలో లెర్నథాన్, ఆన్‌లైన్ రివ్యూ, హ్యాకథాన్ అని, ఈ నమూనా ప్రకారం విద్యార్థులకు ప్రగతిశీల విద్యా ప్రయాణాన్ని అందిస్తున్నామన్నారు. స్కిల్ పలావర్ మూడో దశలో విద్యార్థులు 10 ప్రధాన సవాల్ రంగాల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమాన్ని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేష్, సీఎస్ఈ, ఈసీఈ, ట్రిపుల్ ఈ, ఏడీ డీఎస్, సీఎస్ఐటీ, సీఈ విభాగాలు, వాటి అనుబంధ విభాగాల విభాగాధిపతులు, స్పోక్‌లు సమన్వయం పరిచారు. వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ రాజశేఖరరావు తదితరులు పర్యవేక్షించారు.

క్రీడాకారులను తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఇస్కా స్పోర్ట్స్ ఫౌండర్ సునీల్

తాడేపల్లి రూరల్: రాష్ట్రం నుంచి క్రీడాకారులను తీర్చిదిద్దనున్నట్లు ఇస్కా స్పోర్ట్స్ ఫౌండర్ సునీల్ చెప్పారు. తాడేపల్లి రూరల్ పరిధిలోకి కొలనుకొండలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో ఆంధ్ర క్వెస్ట్ ఫర్ ఒలంపిక్ గోల్డ్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇస్కా స్పోర్ట్స్ ఫౌండర్ సునీల్ మాట్లాడుతూ క్రీడల్లోని నాలుగు రంగాలను అభివృద్ధిచేస్తే 2036లో జరిగే ఒలింపిక్స్‌లో ఏపీ నుంచి బంగారు పతకం సాధించేందుకు అవకాశం ఉందన్నారు. క్రీడా భారతి ప్రభుత్వం సహకారంతో కొన్ని క్రీడలను దత్తత తీసుకుని ప్రైవేటు సెక్టార్‌తో కలసి క్రీడాకారులను తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి కోకో, కబడ్డీ, ఫుడ్ బాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్, జిమ్నాస్టిక్స్ వంటి క్రీడల్లో పాల్గొనేందుకు ఒక డిజైన్ చేయడానికి సెమినార్ నిర్వహించామని తెలిపారు. సెమినార్‌లో క్రీడలకు సంబంధించిన ప్రముఖుల సలహాలతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నామని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అలయెన్స్‌గా ఉండటంతో క్రీడలను మరింత ముందుకు తీసుకెళ్తామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్రీడా భారతి జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ జుగదర్, క్రీడా భారతి ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ ధనుంజయ్‌రెడ్డి, బాలలత సీబీడీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో భారీ వర్షం



ఇందిరానగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



మంగళగిరిలో నిలిచిన వర్షం నీరు

మంగళగిరిటౌన్: మంగళగిరిలో ఆదివారం మధ్యాహ్నం ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో జన జీవనం స్తంభించింది. డ్రైన్లు పొంగిపొర్లాయి. రహదారులు కాలువలుగా మారాయి. నగర పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు వర్షం ప్రభావంతో జలమయమయ్యాయి. టిడ్కో గృహ సముదాయంలో నీళ్లు నిలిచాయి. చిన్నపాటి వర్షానికే టిడ్కో గృహ సముదాయం అంతా మోకాలి లోతు నీరు రావడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందిరానగర్ రోడ్లు నీట మునిగాయి.

రోడ్లపై పశువులు



ఫిరంగిపురం: గుంటూరు, కర్నూలు రహదారి వేమవరం అడ్డరోడ్డు నుంచి మేరికపూడి గ్రామశివారు వరకు రహదారి పక్కగా పశువులు ఉండటంతో ఇబ్బందికరంగా మారుతోంది. అవి గడ్డి మేయడం కోసం చీకటి పడేంతవరకు వాటి యజమానులు పశువులను అక్కడే ఉంచుతున్నారు. తర్వాత పశువులు ఇంటికి వెళ్లడానికి ఒక్కసారిగా రహదారిపైకి వస్తున్నాయి. అటుగా వెళ్లే ద్విచక్ర వాహనచోదకులు వాటిని తప్పించే యత్నంలో కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికే వీటితో ప్రమాదాలు జరిగి కొందరు గాయపడగా.. కొన్ని ఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. వీటిని రోడ్డుపై ఉంచకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచార కార్యక్రమంలో కమిటీల సభ్యులు

తెనాలి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక, గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తెనాలి రూరల్ మండల గ్రామం సోమసుందరపాలెంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. దైవజ్ఞానం ప్రకారం కులాలు అహేతుకం అని, మతాలు నిషిద్ధం అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందని, ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలి అనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉన్నాడని – జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అన్నారు. భగవద్గీతలో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలనీ, వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుంచి బయట పడేసి మనిషికి ముక్తిని ఇస్తాయని వివరించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి – ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు టీవీ కృష్ణారావు, బి.శివలింగంనాయక్, జె.హరిబాబు, ఫణిధరం శివ, పట్టాబి శ్రీను, మౌనిక, షేక్ దిల్షా, ఎ.అన్నపూర్ణ, ఎ.షైనీ పాల్గొన్నారు.

పారుదల కాని నీటితో అవస్థలు



తూములూరు ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

తూములూరు(కొల్లిపర): మండల పరిధిలో తూములూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో లూథరన్ చర్చి వద్ద వర్షం వచ్చిందంటే చాలు.... ఆ సీసీ రోడ్డు పొడవునా వర్షపు నీరు నిలుస్తుంది. వర్షం, బురదలో రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. వర్షం తగ్గిన తరువాత కూడా నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడం వలన ఆ వర్షం నీరు రోజుల తరబడి అలాగే ఉండటం వలన స్థానికులు అనేకసార్లు పంచాయతీ అధికారుల దృష్టికి సమస్య తీసుకుపోతున్నా వారు పట్టించుకోవటం లేదు. ఈ రోడ్డులో సుమారు 20 కుటుంబాలు జీవిస్తున్నారు. దీనికి తోడు ఆ రోడ్డులోనే రేషన్ షాపు ఉండటం వలన ప్రతినెల 15రోజుల పాటు గ్రామస్తులు రేషన్ సరుకులు తీసుకోవటానికి వస్తుంటారు. రేషన్ సరుకులకు వచ్చేవారు, స్థానికులు ఆ వర్షం నీళ్ల లోనే నడుచుకుంటూ వెళ్లాల్సివస్తుంది. ఎక్కువ రోజులు రహదారులపై నీరు నిల్వ ఉండటం వలన దోమల నిలయంగా మారి స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వర్షం వచ్చినప్పుడు ఎటువంటి వర్షం నీరు నిలబడకుండా పారుదల అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి



మంత్రి మనోహర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. తెనాలి బోసురోడ్డులోని మంత్రి కార్యాలయంలో ఆదివారం నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలలు దాటినా ఒక్క పెండింగ్ బకాయి కూడా ఉద్యోగులకు విడుదల చేయలేదని ఆరోపించారు. ఇప్పటివరకు నాలుగు డీఏలు రావాల్సి ఉందని, కనీసం దసరా నాటికైనా ఒక డీఏ విడుదల చేసే విధంగా చూడాలన్నారు. అలాగే పీఆర్‌సీని కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాలీద్, తెనాలి జోన్ కన్వీనర్ పుట్టా జనార్ధనరావు, నాయకులు సిహెచ్ లక్ష్మణ్‌కుమార్, పద్మావతి, జి.దాసు, మాలకొండయ్య, పద్మజ, ఏసుబాబు, వై.శ్రీనివాసరావు, పోతార్లంక శ్రీనివాస్, శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కులు పంపిణీ

తెనాలిఅర్బన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రమాద బీమా చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. సుల్తానాబాద్‌కు చెందిన కన్నెగంటి ఝాన్సీరాణి, ఖాజీపేటకు చెందికు పోతాబత్తిన వరుణ్ నాగ్ ఇటీవల వేరు వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. వారి ఇళ్ళకు వెళ్ళి ప్రమాద బీమాకు సంబంధించిన రూ.5లక్షల చెక్కులను పంపిణీ చేశారు.







